www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 30 జూన్ 2024

5

కాకినాడ

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

జూలై 4న జరిగే అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక వరహాలయ్యపేటలోని యనమల సూర్యారావు భవనంలో జరిగిన సభలో ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న మధ్యాహ్నం 2 గంటలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జూలై 1, 2, 3 తేదీల్లో పాఠశాలల వారీగా వ్యాస రచన పోటీలు, 4న క్విజ్ పోటీలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం జరిగే జయంతి సభలో విజేతలకు బహుమతి ప్రధానం జరుగుతుందన్నారు. వివరాల కోసం 7901697939, 9000695301, 9441709187 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

'అమ్మ'కు ఆర్థిక భరోసా ఏదీ.?

- పిఎంఎంవివై పథకం అమల్లో నిర్లక్ష్యం
- 9 వేల మందికి నిలిచిన సాయం
- నిరీక్షిస్తున్న తల్లులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మాతా శిశు మరణాలు తగ్గించడం, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెరగడం, తల్లీబిడ్డలకు పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన (పిఎంఎంవివై) పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఆచరణలో బిడ్డల్ని కన్న పేద, మధ్యతరగతి వర్గాల తల్లులకు భరోసా కరువైంది. నిధుల విడుదలలో జాప్యంతో 2017 నుంచి 2023 వరకూ సుమారు 9 వేల మందికి ఈ పథకం సొమ్ము నిలిచిపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వీడి బకాయి ఉన్న సొమ్మును విడుదల చేయాలని కోరుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్త్రీ, శిశు సంక్షేమం కోసం అనేక ప్రయోజనాలను అందిస్తున్నాయి. తొలి, మలిసారి గర్భవతి అవుతున్న మహిళల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకాన్ని 2017 జనవరిలో ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు అనేక మంది మహిళలు ఈ పథకం కోసం నమోదు చేసుకుని ఆర్థిక సహాయం అందుకుంటున్నారు. మహిళలు, నవజాత శిశువు భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం దీనిని రూపొందించింది. మొదట్లో ఈ పథకం కింద గర్భిణీ స్త్రీలకు, తల్లి పాలిచ్చే మహిళలకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించేవారు. మూడు వేర్వేరు వాయిదాలలో ఈ నగదు జమ చేసేవారు. 19 ఏళ్లకు ముందే గర్భవతి అయిన మహిళలకు ఈ పథకం కింద ప్రయోజనం లభించదు. ఈ పథకం ద్వారా గర్భిణుల బ్యాంకు ఖాతాకు కేంద్ర ప్రభుత్వం రూ.5 వేలు బదిలీ చేస్తుంది.

త్వరలో అందరికీ సాయం

పిఎంఎంవివై వెబ్ సైట్ పాత వెర్షన్‌లో అనేకమంది గర్భిణీల వివరాలు నమోదు కాలేదు. 2023 ఆగస్టు తర్వాత వెర్షన్‌లో మార్పులు తీసుకొచ్చారు. వారందరినీ వెబ్ సైట్‌లో నమోదు చేసి పిఎంఎంవివై లబ్ధి చేకూరేల చర్యలు తీసుకుంటాం.

-నరసింహ నాయక్, డిఎంఅండ్ హెచ్‌ఒ,కాకినాడ జిల్లా

ఇదీ అమలు తీరు

జిల్లా కేంద్రం కాకినాడలో జిజిహెచ్, 43 పిహెచ్‌సిలు, 23 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఇంకా ఇతర ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రతీ నెలా వేల్లో డెలివరీలు అవుతున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో గర్భిణిగా నమోదైన వెంటనే ఆ ప్రాంత పరిధిలో వైద్య సిబ్బంది పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం వైద్యాధికారితో ధృవీకరించిన తరువాత పిఎంఎంవివై వెబ్‌సైట్లో నమోదు చేస్తారు. ఇలా నమోదైన గర్భిణులు అందరికీ దశల వారీగా సాయం జమ అవుతుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మొదటి 3 నెలల్లో రూ.1000 అందజేస్తారు. ఆరో నెలలో ఆరోగ్య పరీక్షలు పూర్తయ్యాక రూ.2 వేలు, బిడ్డకు మొదటి విడత టీకా కార్యక్రమం పూర్తయినప్పుడు రూ.2 వేలు తల్లి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. గతంలో కేవలం ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం అయిన వారికే సాయం చేసేవారు. కొంతకాలంగా ప్రయివేటు ఆసుపత్రుల్లో ప్రసవం అయినా అందించేలా ఏర్పాటు చేశారు.

9 వేల మందికి పెండింగ్

2017 నుంచి 2023 ఆగస్టు వరకూ వెర్షన్ 1.0లో ఉన్నప్పుడు మొదటి కాన్పు తల్లులకు మాత్రమే మూడు దశల్లో ఆర్థిక సహాయం అందించేవారు. అప్పట్లో జిల్లాలో వేల మంది గర్భవతులు, డెలివరీ వివరాలు నమోదు కాలేదు. దీంతో సుమారు 9 వేల మంది నేటికీ సాయం కోసం ఎదురు చూస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

2023 ఆగస్టు నుంచి వెర్షన్ 2.0 అమల్లోకి వచ్చినప్పటి నుంచి మొదటి కాన్పు తల్లులకు 2 విడతలుగా రూ.5 వేలు వేస్తున్నారు. అలాగే రెండో కాన్పులో బాలిక మాత్రమే పుడితే ఒకే విడతలో రూ.6 వేలు ఖాతాలో జమ చేస్తున్నారు. 2023 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 6,121 మందికి రూ.1 కోటి 83 లక్షల 63 వేలు మొదటి కాన్పు తల్లులకు అందించారు. రెండో కాన్పులో 2,647 మందికి రూ.1 కోటి 58 లక్షల 52 వేలు అందించారు.

పేదలకు ఆసరా కరువు

పక్షం రోజులపాటు వేతనంతో పనిచేస్తున్న శ్రామిక మహిళలతోపాటు ఆర్థికంగా వెనకబడి ఉన్న వారికే వర్తిస్తుంది. ఈ ఆర్థిక సహాయం పొందడం ద్వారా వెనకబడిన వర్గాలకు చెందిన గర్భిణులు పనికి వెళ్లకుండా విశ్రాంతి తీసుకోవడానికి సమయం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పని చేస్తున్న మహిళలకు ఈ పథకం వర్తించదు. అయితే గతంలో పాత వారికి ఆర్థిక సాయం నిలిచిపోవడంతో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. కష్టకాలంలో ప్రభుత్వం అందించే సాయం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. గర్భిణులకు పోషకాహారం, మందుల కోసం రూ. వేలు వెచ్చించాల్సి ఉంటుంది. వాటికి డబ్బులు లేక ఇబ్బందులు పడే కుటుంబాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి సకాలంలో సాయం విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా కుటుంబాలు కోరుతున్నాయి.

డిప్యూటీ సిఎం పర్యటనకు ఏర్పాట్లు : కలెక్టర్

ఉప ముఖ్యమంత్రి పర్యటనపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ జూలై 1 నుంచి 3 రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారు, కావున అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి జూలై 1 నుంచి 3వ తేదీ వరకూ పిఠాపురం నియోజకవర్గంలోను, కాకినాడలోను పర్యటిస్తారని తెలిపారు. జూలై 1వ తేదీన గొల్లప్రోలు చేరుకుని, ఉదయం 10 గంటల నుంచి 12-30 గంటల వరకూ విల్లాస్ సత్యకృష్ణ కన్వెన్షన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ప్రణాళిక, ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని డిఆర్‌డిఏ పిడీకి సూచించారు. జూలై 2వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకూ డ్వామా, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యుఎస్, జడ్‌పి, పర్యావరణ శాఖల అధికారులతో శాఖల వారీగా సమీక్షిస్తారని తెలిపారు. ఈ సమీక్షకు ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. జూలై 3 వ తేదీ ఉదయం 10-45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉప్పాడ తీరంలో సముద్ర కోతకు గురైన ప్రాంతాలను సందర్శించి, తీర ప్రాంత రక్షణకు చేపట్టవలసిన చర్యలపై అధికారులు, నిపుణులతో చర్చిస్తారన్నారు. ఉప్పాడ తీరం పూర్తిగా ఏవిధంగా ఉండేది, ప్రస్తుతం ఎలా ఉన్నది వివరించేందుకు ఛాయాచిత్రాలు, మ్యాప్‌లను సందర్శన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచించారు. సాయంత్రం 4 గంటలకు పిఠాపురంలో నియోజక వర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన వారాహి సభలో పాల్గొంటారని, సభా ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు తాగునీరు, అంబులెన్సులు తదితర ఏర్పాట్లను చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జెసి ఎస్.రాంసుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ డాక్టర్ కె.తిప్పేనాయక్, డిఆర్‌డిఏ పీడీ శ్రీ రమణి, డిపిఒ కె.భారతి సౌజన్య, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జడ్‌పి సిఇఒ శ్రీరామచంద్రమూర్తి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ జె.నరశింహనాయక్, డిఐపిఆర్ డి.నాగార్జున, ఆర్‌డిఒలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, డిఎల్‌డిఒ కాకినాడ పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన కార్మికుల ఆందోళన

వర్షంలో ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - సామర్లకోట

అక్రమంగా తొలగించిన తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 19వ రోజు శనివారం రాక్ సిరామిక్స్ కార్మికులు వర్షంలోనూ నిరసన కొనసాగించారు. గత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు ఏ నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించి నేటికీ 76 రోజులు గడుస్తున్నా యాజమాన్యంలో ఎటువంటి స్పందన లేకుండా పోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ గేటు ముందు ఆందోళన ప్రారంభించి 19 రోజులు అవుతుందని గుర్తు చేశారు. తక్షణం యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే కంపెనీలోకి కార్మికులు వెళ్లకుండా గేటు ముందు కూర్చుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్, చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వర ప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్‌రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధకుల కోసం నిర్వహించిన 5 రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ఘనంగా ముగిసింది. మొదటి రోజు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ని డేటా సైన్స్ రంగానికి ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై వివరించారు. 2, 3 రోజులపాటు డిఎం ఐఐటి సిఎస్‌సి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు, 4వ రోజు ఆదిత్య యూనివర్సిటీ ఎఐఎంఎల్ విభాగం అధిపతి డాక్టర్ మాగంటి వెంకటేష్, అదేరోజు మధ్యాహ్నం న్యూఢిల్లీ ఎన్ఐసి శాస్త్రవేత్త శంకర సుబ్బారావు, 5వ రోజు ఆంధ్రప్రదేశ్ ఐఐటి సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్, యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 5 రోజులపాటు కళాశాల అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దోలా సంజయ్ ఎస్, డీన్ ఆర్ అండ్ సి డాక్టర్ కెవిఎస్ఆర్.మూర్తి, విభాగాధిపతి డాక్టర్ కె.స్వరూప, కోఆర్డినేటర్ డాక్టర్ టి.ప్రభాకరరావు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

'వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలి'

సోషల్ వెల్ఫేర్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలకు నూతన భవనాలను నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ బృందం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎం.లల్లీని కలిసి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో అనేక విద్యా సంస్థలు ఉండటం వలన గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో సరిపోయినన్ని వసతి గృహాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులకు కొత్త హాస్టళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పిఠాపురం బాలుర పాఠశాల, కళాశాల హాస్టల్‌కు ఫర్నిచర్, ఫ్యాన్లు, లైట్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రస్తుతం పాత హాస్టల్ భవనాలు వర్షాకాలంలో లీకేజీ సమస్యలు చాలా ఉన్నాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ ఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులందరినీ ఐక్యం చేసి ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కాకినాడ నగర అధ్యక్ష కార్యదర్శులు సంజయ్, వాసుదేవ్ కాకినాడ రూరల్ కార్యదర్శి సిహెచ్ సాహిత్, కాకినాడ రూరల్ నాయకులు విపిన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ దృష్టికి కార్మికుల సమస్యలు

మంత్రి సుభాష్‌తో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ దృష్టికి సిఐటియు బృందం కార్మికుల సమస్యలను తీసు కెళ్లింది. శనివారం రామచంద్రపురంలో మంత్రి స్వగృహంలో బృందం మర్యాదపూర్వకంగా కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును మొదటి క్యాబినెట్ సమావేశంలోనే పునరుద్ధరించడం తోపాటు కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. పరిశ్రమలలో కార్మికులను తొలగించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే యాజమాన్యాల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని, ఏ ఒక్క కార్మికుణ్ణి తొలగించినా ఊరుకునేది లేదని, చట్ట వ్యతిరేక తొలగింపులకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారన్నారు. అసంఘటిత కార్మికులకు వైసిపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని, దాన్ని సరిచేస్తూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించి కార్మికుల కుటుంబాలను ఆదుకుం టామని తెలిపారన్నారు. త్వరలో జరగబోయే మొదటి క్యాబినెట్ మంత్రుల సమావేశంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరిస్తూ నిర్ణయం చేయబోతున్నామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సహాయ కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్, రాక్ సిరామిక్ కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, మంగారవు, మల్లిఖార్జున, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి పూర్తి సహకారం అవసరం: చినరాజప్ప

ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న కౌన్సిల్ సభ్యులు, అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపల్ అభివృద్ధికి పూర్తి సహకారం అవసరమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి వరుసగా మూడు దఫాలు ఎంఎల్ఎగా విజయం సాధించిన చినరాజప్పను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు పుష్ప గుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో తాను ఎంఎల్ఎగా ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు చేయనీయకుండా తనను అడ్డుకున్నారని అన్నారు. రాబోయే కాలంలో కౌన్సిల్ సభ్యులంతా పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పార్టీలతో సంబంధం లేకుండా పట్టణాన్ని అభివృద్ధి పరచి మున్సిపల్ కౌన్సిల్‌కి మంచి పేరు తీసుకురావడంలో కౌన్సిల్ పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

రెండు అంశాలపై చర్చ

ఎజెండాలోని రెండు అంశాలు మినహా ఎలాంటి చర్చ జరగకుండా కౌన్సిల్ సమావేశం ముగిసింది. 13 అంశాలతో కూడిన ఎజెండాపై చర్చకు అధికారులు ప్రారంభించారు. ఒక ప్రయివేట్ సంస్థకు చెందిన టెక్నిషియాన్ వేతనాలు రూ.3,73,667 చెల్లించాల్సిన అంశాన్ని ఆమోదం కోసం ప్రవేశపెట్టగా వైసిపి కౌన్సిలర్ ఆవాల లక్ష్మినారాయణ అభ్యంతరం తెలిపారు. దీంతో వాయిదా వేశారు. అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడు మిరియాల రాజు మృతి నేపథ్యంలో ఆయన కుటుంబానికి చెల్లించే రూ. 2 లక్షల పరిహారం చెల్లింపునకు కౌన్సిల్ ఆమోదాన్ని కోరారు. దీనిపై పలువురు కౌన్సిలర్లు పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంపుదల చేయాలని కోరారు. దానికి ఎంఎల్ఎ చినరాజప్ప సైతం ఆమోదం తెలిపి, వెంటనే బాధితుని కుటుంబానికి చెల్లించాలని కమిషనర్‌కు సూచించారు. మిగిలిన అంశాలను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

10వ తరగతి ర్యాంకర్లకు స్కాలర్‌షిప్ పంపిణీ

స్కాలర్ షిప్‌ను అందిస్తున్న డాక్టర్ కాదా

ప్రజాశక్తి - కాకినాడ

సత్య చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 10వ తరగతిలో ర్యాంకులు సాధించిన 60 మంది విద్యార్థులకు రూ.7.20 లక్షల స్కాలర్ షిప్ చెక్కులను ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ కాదా వెంకటరమణ పంపిణీ చేశారు. శనివారం స్థానిక జెఎన్‌టియు అలూమిని ఆడిటోరియంలో సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్య స్కాన్స్ అండ్ డయగ్నోస్టిక్ సెంటర్ 25వ వార్షికోత్సం పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా నిర్వహించిన స్కాలర్ షిప్ టెస్ట్ ర్యాంకర్లకు స్కాలర్ షిప్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. డాక్టర్ కాదా వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్. హెల్త్ యూనివర్శిటి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కె.బాబ్జీ, కెఎస్‌పిఎల్ సిఇఒ మురళీధరన్, ఐఎంఎ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ జిఎస్.మూర్తి, రోటరీ పాస్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్‌విఎస్.రావు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి, భాష్యం పబ్లిక్ స్కూల్ జోనల్ ఇన్‌ఛార్జ్ గోవిందరాజులు, సత్య స్కాన్ సెంటర్ డైరెక్టర్లు డాక్టర్ కె.విష్ణుమూర్తి, డాక్టర్ పి.లక్ష్మణమూర్తి పాల్గొని మాట్లాడారు. తను పడ్డ కష్టం ప్రతిభ గల ఏ పేద విద్యార్థులకు రాకూడదనే లక్ష్యంతో సత్య స్కానింగ్ సెంటర్ ఎండి డాక్టర్ కాదా వెంకటరమణ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. డాక్టర్ కాదా వెంకటరమణ మాట్లాడుతూ 60 మంది ర్యాంకర్లు ఇంటర్ లోనూ, ఎంసెట్లో వారు సాధించిన ర్యాంకుల బట్టి భవిష్యత్తో వారికి ట్రస్ట్ తరపున ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం ర్యాంకర్లకు స్కాలర్ షిప్ చెక్కులను పంపిణీ చేశారు.

కౌన్సిల్ సమావేశం గరం..గరం

ప్రజాశక్తి - పిఠాపురం

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గరం..గరంగా సాగింది. సభ్యుల ప్రశ్నలకు సరియైన రీతిలో అధికారులు సమాధానం చెప్పకపోవడాన్ని తప్పుపడుతూ కౌన్సిల్ సభ్యుల సభను వాకౌవుట్ చేశారు. దీంతో సమావేశం అర్థాంతరంగా ముగిసిపోయింది. శనివారం పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన ప్రారంభమైంది. సమావేశం ప్రారంభంలో కౌన్సిలర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు మృతి చెందితే కౌన్సిల్ కనీసం మౌనం కూడా పాటించదా అని ప్రశ్నించారు. దీంతో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన కౌన్సిలర్ అయితే రాంబాబు సంతాపం ప్రకటించింది. గతంలో పారిశుధ్య నిర్వహణకు 30 పోస్టులను భర్తీ చేసుకోవాలని కౌన్సిల్ ఆమోదించినా ఎందుకు భర్తీ చేయలేదని నగేష్ నిలదీశారు. కౌన్సిల్ అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైన వివరణ ఇవ్వడం లేదని కౌన్సిల్‌కి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు.

కార్టూ'నిజం'



'రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం'



ఎంఎల్ఎ చినరాజప్పను సత్కరిస్తున్న ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - పెద్దాపురం

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుదామని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. శనివారం పెద్దాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సంద ర్భంగా ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఎంఎల్ఎ చినరాజప్పను కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పూలమాలలు, సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి రాజకీయాలు అడ్డుకారాదని అన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచండి

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దష్టిలో పెట్టుకుని పట్టణ పరిధిలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన పెంచాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అన్నారు. నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో అతిసార వ్యాధి విస్తరిస్తున్నందున పట్టణ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, మురుగునీటి కాలువల పరిశుభ్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అత్యవసరంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా ట్యాంకులు, స్పాట్ డెలివరీ ట్యాంకులు, పైపులైన్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు రాజశేఖర్ ఆకుల కృష్ణ బాపూజీ పేరిశెట్టి అంబిక తమ వార్డులో నెలకున్న పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, డిఇఇ ఆదినారాయణరావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఎఇ కృష్ణ జీవప్రసాద్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 253 కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రమౌళేశ్వరి

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

పెద్దాపురం కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 253 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ లోక్ అదాలత్‌ల నిర్వహణకు 3 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్‌కు 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళేశ్వరి అధ్యక్షులుగా, న్యాయవాది ఎ.ప్రభూజి సభ్యులుగా, రెండవ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె.దీపాదివ్యకృప అధ్యక్షులుగా, న్యాయవాది కెఎంఎల్.గణేష్ సభ్యులుగా, మూడవ బెంచ్‌కు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్ అధ్యక్షులుగా, న్యాయవాది ఎం.రాంబాబు సభ్యులుగా వ్యవహరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 43, క్రిమినల్ కేసులు 67, మోటార్ వెహికిల్ ప్రమాద కేసులు 5, ప్రీ లిటిగేషన్ కేసులు 2, ప్రీ లిటికేషన్ బిఎస్ఎన్ఎల్ కేసులు 8, క్రిమినల్ చలానా కేసులు 128 పరిష్కారమయ్యాయని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 7 వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళేశ్వరి తెలిపారు.

పిఠాపురంలో..

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిఠాపురం కోర్టుల ఆవరణలో 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి పర్యవేక్షణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన బాధితురాలికి రూ.50 లక్షల నష్టపరిహారంను ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అందజేశారు. మూడు బెంచ్‌లలో 111 సివిల్, క్రిమినల్, మోటార్ వెహికల్, మెయింటినెన్స్, డివిసి కేసులు పరిష్కారం అయ్యాయి. గత కొంతకాలంగా కోర్టు పరిధిలో భార్యాభర్తలు వేసుకున్న విడాకుల కేసులు నలుగురు పరిష్కారం దిశగా ఆలోచన చేసి, వారు కలుసుకున్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయ రామేశ్వరి, న్యాయవాదులు కె.వీరభద్రరావు, ఇన్సూరెన్స్ సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది ఎస్‌వి.రాధాకృష్ణ, వైవియన్ మూర్తి, డి.రమేష్ బాబు, కొంజర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను తక్షణమే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. శనివారం మండలంలోని పి.మల్లవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు మొగలతుర్తి నాగేంద్రరావు, నేతల నాగరాజు, పేరాబత్తుల సుబ్రహ్మణ్యం, ఉండ్రు కనకయ్య, ఉండ్రు శ్రీనివాసు, సింహాద్రి తదితరులు మాట్లాడారు. పి. మల్లవరం పంచాయతీ పరిధిలో 72 మంది రైతులకు రూ.74 లక్షల బకాయిలు రావాల్సివుందన్నారు. గత ఖరీఫ్, రబీ సీజన్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా తూసిన ధాన్యానికి సంబంధించి నేటికీ రైతుల అకౌంట్లో సొమ్ములు జమ కాలేదని తెలిపారు. తొలకరి ప్రారంభమై నెల రోజులు గడిచిపోయిందని, ప్రస్తుత పెట్టుబడికి డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెంటనే స్పందించి ధాన్యం బకాయిలను రైతుల ఖాతాలకు వెంటనే జమ చేయించాలను విజ్ఞప్తి చేశారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వాకతిప్పలోని నాగులపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథకం (సూరప్ప చెరువు)లో పని చేయడానికి వచ్చిన వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రక్షిత మంచినీటి పథకం సూరప్ప చెరువులో పనుల కోసం కాకినాడ వలస పాకలకు చెందిన పదిమంది కూలీలు వచ్చారు. తంగెళ్ల అప్పన్న (25) చెరువు వద్దకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి గల్లంతవడంతో గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. నష్టపరిహారం కోసం మృతుని కుటుంబీకులు ఆందోళనకు దిగారు. నష్టపరిహారంగా రూ.50 లక్షలు ఇవ్వాలని మృతదేహంతో నిరసన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులు వారితో చర్చలు నిర్వహించారు. మృతుని కుటుంబానికి కనీసంగా రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతదేహంతో ఆందోళన కొనసాగిస్తున్నారు.

ప్రమాదకరంగా ఉన్న వంతెన

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని పాలెం, తామరాడ గ్రామాల మధ్య ఉన్న ఏలేరు నది బ్రిడ్జి ప్రహరీ గోడ కూలిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. నియోజకవర్గంలోని వీరవరం, రాజుపాలెం, కిర్లంపూడి అనేక గ్రామాలతోపాటు, పెద్దాపురం వంటి పట్టణాలకు వెళ్ళేందుకు ఏలేరు కాలువపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి ఇది. అయితే అటువంటి బ్రిడ్జికి పాలెం గ్రామం వైపు గోడ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. వాహనాలు వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు కాలువలో పడే పరిస్థితులు ఉన్నాయి. వెంటనే అధికారులు స్పందించి ప్రహరీ గోడను నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

శిథిలమైన భవనంలో కర్మకాండలు నిర్వహిస్తున్న వైనం

శిథిల స్థితిలో శ్మశాన వాటిక భవనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు పంచాయతీ శ్రీ రంగనాయకపురం, గుత్తులవారిపాలెం గ్రామాలకు చెందిన శ్మశాన వాటిక భవనం శిథిలావస్థలో ఉంది. సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ శ్మశాన వాటిక భవనం పునాది భూమిలోకి కుంగిపోయింది. దీనివల్ల భవనం పిల్లర్స్ బీటలు తీశాయి. భవనం పైనుంచి స్లాబ్ పెచ్చులుగా ఊడి కింద పడిపోతుంది. పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ముంపు సమస్య నివారణకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

వర్షం కారణంగా ఏర్పడే ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. శనివారం స్థానిక లక్ష్మీనారాయణ నగర్ ప్రాంతంలోని మదర్ థెరిసా విగ్రహం నుంచి ఫౌండేషన్ ఆసుపత్రి మీదుగా చర్చి వరకు ముంపునకు గురైన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షం కారణంగా ఆ ప్రాంతం నీట మునగడంతో కమిషనర్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ముంపు సమస్య ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగానికి చెందిన అధికారులతో చర్చించారు. రహదారులను ఎత్తు చేసేందుకు అవసరమైన అంచనాల రూపొందించాలని ఆదేశించారు.

ఓవైపు జోరు.. మరోవైపు బేజారు..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఓవైపు పాలనా యంత్రాంగం పాలనలో తమదైన ముద్ర చూపించేందుకు పోటీ పడటంతో మరోవైపు పెరుగుతున్న ధరలు ప్రజల్లో బేజారు వ్యక్తమవుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వం ఏర్పాటైన విషయం విదితమే. జిల్లాలోని ఎంఎల్‌ఎలు, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు అధికారికంగా ముగియడంతో పాలనను పట్టాలెక్కించేందుకు తరతమ స్థాయిలో తమదైన మార్కు చూపించేందుకు పోటీపడుతున్నారు. కొంత మంది వైద్య ఆరోగ్య శాఖ , పోలీసు విభాగాల్లో దృష్టి సారించగా ఇంకొందరు పౌరసరఫరాల శాఖల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే తాజా పరిణామాలు ప్రజలకు మేలు చేసేందుకు ఏ మేరకు దోహద పడతాయో వేచి చూడాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్రమమార్గంలో తరలిపోతున్న ఇసుకకు అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి నేతల తెర వెనుక నడుపుతున్న రాజకీయాలు ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను ఎండగడతామంటూ ప్రకటించిన నేతలే రాజీ పడటం విమర్శలకు దారి తీస్తుంది. టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొటిగా అమలు చేసేందుకు అడుగులు వేస్తోంది. కొత్తగా కొలువు దీరిన కలెక్టర్, ప్రజా ప్రతినిధులు అధికార యంత్రాంగాన్ని గాడిలో పెట్టి ఏ మేరకు ప్రజారంజక పాలన అందిస్తారో వేచి చూడాలి.

చుట్టుముడుతున్న సీజనల్ వ్యాధులు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న డయేరియా కేసులు జిల్లాలోనూ ఒక్కొక్కటిగా వెలుగులోకి రావటంతో ప్రజల్లో కలవరం మొదలైంది. డయేరియా నిర్మూలనకు అధికార యంత్రాంగం ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. మరో వైపు తాగునీటి ట్యాంకుల పరిశీలన శుభ్రతపై దృష్టి సారించడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేయటం వంటి పరిణామాలు ప్రజలకు ధైర్యం కల్గిస్తున్నాయి. ఇదే సందర్భంలో జ్వర పీడితుల సంఖ్యా రోజురోజుకి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్ర ఆస్పత్రులకు తరలి వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వసతులు సౌకర్యాలు మెరుగుపరిస్తే కొంత మేర భారంలో ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికులకు తప్పని వెతలు

జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్ల రద్దు నిర్ణయాన్ని రైల్వే శాఖ ఉపసంహరించుకున్నట్లు ప్రకటించినా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉపసంహరణ ప్రకటన ఆచరణలో పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోక పోవటమే ఈ దుస్థితికి కారణం. కడియం నుంచి నిడదవోలు వరకూ రైల్వే ట్రాకు మరమ్మతుల నేపథ్యంలో జిల్లా మీదుగా వెళ్లే సుమారు 15 రైళ్లను రద్దు చేసిన విషయం విదితమే. ప్రయాణికుల నుంచి విమర్శలు రావటంతో యథావిధిగా నడుస్తాయని ఆ శాఖ అధికారులు ప్రకటించారు. అయితే గడిచిన మూడు రోజుల వ్యవధిలోనే రెండు సార్లు విజయవాడ టు విశాఖపట్నం చేరుకొనే రత్నాచల్ తదితర రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర కేంద్రంలో పనిచేసే ఉద్యోగులకు ప్రత్యామ్నాయ రైళ్లు లేకపోవటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సర్వీసులు కొనసాగించాలని ఉద్యోగులు, ప్రయాణికులు రైల్వే శాఖ అధికారులను కోరుతున్నారు.

కొండ దిగనంటున్న కూరగాయలు

కూరగాయలు కొండ దిగనంటున్నాయి. గత రెండు వారాలుగా ధరలు ఆకాశాన్నంటుతున్న విషయం విదితమే. ఈ వారంలో టమోటా కిలో రూ.80కి చేరింది. రైతు బజార్లలో పంపిణీ చేస్తున్న టమోటాలు డిమాండ్‌కు తగ్గట్లుగా లేకపోవటంతో ప్రజలకు ఊరట లభించడంలేదు. ఉన్నతాధికారులకు దృష్టి సారించి ప్రజలకు అవసరాలకు తగ్గట్లుగా ధరలను నియంత్రించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

అధికారులకు వివరిస్తున్న వల్లు రాజబాబు

'భూ అధీకృత చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి'

ప్రజాశక్తి - కాకినాడ

కౌలు రైతుల ప్రయోజనాల కోసం 2011లో చేసిన భూ అధీకృత చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లై, రైతాంగ సమస్యలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంఘాల పోరాట ఫలితంగా 2011లో కౌలు రైతులకు భూ అధీకృత చట్టం వచ్చిందని దానివల్ల కౌలు రైతులకు కొంత మేలు జరిగిందన్నారు. కానీ 2019లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దుచేసి పంట సాగు దారు హక్కు పత్రం, సిసిఆర్ సి కార్డులు తీసుకురావడం వల్ల కౌలు రైతులకు నష్టం జరిగిందన్నారు. భూ యజమాని సంతకం తప్పనిసరి కావడం వల్ల భూ యజమానులు కౌలు కార్డు అంగీకరించడం లేదన్నారు. అందుచేత కౌలు రైతులకు పూర్తిస్థాయిలో కార్డులు అందడం లేదన్నారు. ఈ ప్రభుత్వమైన ఆ చట్టాన్ని రద్దుచేసి 2011 చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎఐలో తిరుగులేని శక్తిగా భారత్

ప్రజాశక్తి - గండేపల్లి

ఎఐ కింగ్‌లో మాట్లాడుతున్న ఆదిశేషయ్య చౌదరి

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)లో భారతదేశం తిరుగులేని శక్తిగా నిలుస్తుందని భారతీయ ఐటి పరిశ్రమలో సలహాదారుగా సేవలందించిన డాక్టర్ జక్కంపూడి ఆదిశేషయ్య చౌదరి అన్నారు. శనివారం సూరంపాలెం ఆదిత్య విశ్వ విద్యాలయంలో నిర్వహించిన 'ఆదిత్య ది ఎ.ఐ కింగ్'లో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి ఆధ్వర్యంలో 1984 నుంచి ఆదిత్య తన ప్రస్థానం అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి సాధిస్తూ యూనివర్సిటీ స్థాయికి చేరుకుందని కొనియాడారు. ఆదిత్య అంటే ఉద్యోగాలు అనే స్థాయికి నేడు ఆయన కుమారుడు డాక్టర్ సతీష్ రెడ్డి గుర్తింపు తీసుకువచ్చారని అభినందించారు. ఆదిత్య ఇండియా స్టార్ట్ అప్ ఫౌండేషన్ ఏర్పాటుకు ఆదిత్య సహకారంతో ప్రారంభించనున్నట్లు తెలిపారు. భావి ఇంజినీర్లు వినూత్న ఆలోచనలు, స్టార్ట్ అప్‌లకు కార్యరూపం దాల్చడానికి ఈ ఫౌండేషన్ తోడ్పడుతుందని తెలిపారు. ఈ ఫౌండేషన్‌కు ఆదిత్య యూనివర్సిటీ రూ.1 కోటి ఫండ్‌ను ఏర్పాటు చేస్తుందని ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి ప్రకటించారు. దీనిపై ఆదిశేషయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున రూ.1 కోటి సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ తమ ఆలోచనలకు మరింతగా పదునుపెట్టి సరికొత్త స్టార్ట్ అప్‌లతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా మొదటి ఏడాది నుంచే ప్రణాళిక పద్ధతిలో వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది నుంచి తమ యూనివర్సిటీలో హిందీ, ఇంగ్లీష్‌తోపాటు జపనీస్ భాషలో కూడి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ఫౌండింగ్ పార్టనర్ 108 కాపిటల్, హైదరాబాద్ ఏంజిల్స్ సిఇఒ పిఎస్.శ్రీకాంత్, ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఎఎసి డేటా సైన్స్ విభాగాధిపతి వరుణ్ రావ్, ఎఐ విభాగాధిపతి. సిద్ధార్థ రెడ్డి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

కరపలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి - పెద్దాపురం, కరప

బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరేందుకు తల్లిదండ్రులందరూ సహకరించాలని హెచ్ఎం జి కల్పన అన్నారు. శనివారం స్థానిక బచ్చు వీర రాఘవమ్మ మున్సిపల్ ప్రైమరీ పాఠశాల పరిధిలో అంగన్‌వాడీలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేను బడికి పోతా' అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. నూరు శాతం బాలలు చదువుకుంటేనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల విద్యాభివృద్ధిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో సిఆర్‌పి ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు జె.సూర్య కుమారి, ప్రవీణ, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. కరప మండలానికి చెందిన గురజానాపల్లి గ్రామంలో నేను బడికి పోత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపుదల చేయాలన్నా లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె.బుల్లికృష్ణవేణి, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందని, పుస్తకాలు, నోట్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుందని అన్నారు. విద్యార్థుల తల్లీదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎంఎ సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఎంపిటిసి వై.వీరవేణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్లభ స్వామికి రూ 2.93 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలానికి చెందిన తిరుపతిలో శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.2.93 లక్షల ఆదాయం సమకూరిందని ఆయల కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆలయ కమిటి పెద్దలు, అధికారుల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ 1,91,850, అన్నదాన విరాళాల ద్వారా రూ.66,919, కేశఖండన ద్వారా రూ5,760, తులాభారం ద్వారా రూ.350, లడ్డూ ప్రసాదం ద్వారా రూ 25,470, కానుకల ద్వారా రూ.3,000 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారు.

రైతులకు బకాయిలు చెల్లించని వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - కరప

మండలంలో పలువురు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వైసిపి ప్రభుత్వం చెల్లించలేదని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్ తెలిపారు. శనివారం మండలంలోని పేపకాయలపాలెం రైతులను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసిన 525 మంది రైతులకు రూ.4,98 కోట్లకుపైగా వైసిపి ప్రభుత్వం చెల్లించాల్సివుందన్నారు. రైతులకు రావాల్సిన బకాయిల అంశాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

నూతన తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - కిర్లంపూడి

కిర్లంపూడిలోని విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్మించిన అదనపు గరగతి గదులను శనివారం ప్రారంభించారు. రౌండ్ టేబుల్ ఇండియా-77, వైజాగ్ లేడీస్ సర్కిల్ ఇండియా - 201 వారి సహకారంతో 8వ తరగతి గదులను రౌండ్ టేబుల్ ఇండియా-77 ఛైర్మన్ తేజ ముత్యం, ప్రతిక్ సింగ్, భారతీయ విద్యా కేంద్రం జాయింట్ సెక్రెటరీ రాపర్తి సత్యనారయణ, జగపతి నగరం గ్రామ సర్పంచ్ గుడాల శ్రీలతా రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా బివికె జాయింట్ సెక్రటరీ రాపర్తి సత్యనారాయణ మాట్లాడుతూ భారతీయ విద్యా కేంద్రం 65 ఏళ్లుగా విద్యా రంగంలో గిరిజన ప్రాంతాలలో చేస్తున్న సేవలను గుర్తించి గత 10 సంవత్సరాలుగా రౌండ్ టేబుల్ ఇండియా సుమారు 120 తరగతి గదులకు ఆర్థిక సహకారం చేశారని చెప్పారు. కిర్లంపూడిలో ఈ భవన నిర్మాణానికి తోడ్పాటు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బివికె ఎస్టేట్ అధికారి డిఎవి.రమణమూర్తి, కరస్పాండెంట్ బి.సూర్యనారాయణ, ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చంటిబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడారంగంలో వైకుంఠం సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ సీనియర్ పిఇటి తాళ్లూరి వైకుంఠం క్రీడాకారులకు అందించిన సేవలు ప్రశంసనీయమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం సాయంత్రం వైకుంఠం పదవీ విరమణ సభ జరిగింది. హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యాయామోపాధ్యాయులు వైకుంఠం ఉద్యోగ సమయంలో అనేకమంది విద్యార్థులను క్రీడల ద్వారా తీర్చిదిద్ది ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో క్రీడలకు ప్రత్యేక సమయాన్ని కేటాయించి విద్యార్థుల అభ్యున్నతకు ఉపాధ్యాయులు కృ షి చేయాలన్నారు. అనంతరం వైకుంఠం, ఆయన సతీమణి కుమారి దంపతులను గజమాలలు, దుస్సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్, వల్లూరి దొర, బలుసు వాసు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్లు యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, గోలి వెంకట అప్పారావు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం : సిఐ

ప్రజాశక్తి - గండేపల్లి

మన నిర్లక్ష్యమే మన ప్రమాదాలకు కారణాలని సిఐ లక్ష్మణరావు అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసినా ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్డు వెంబడి నిలుపుతున్న ఆటోలు, తదితర వాహనాలపై చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా రోడ్డు ప్రమాదాల విషయంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో రోడ్డు నుంచి డివైడర్ దాటుతున్న వాహనాలు మరింత అప్రమత్తంతో ముందు వెనుక చూసుకుని వెళ్లాలని అన్నారు. రోడ్డు సేఫ్టీ మార్గాలను అనుసరించాలని సూచించారు. నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు పెడతామని హెచ్చరించారు. ఎవరికైనా రోడ్డు ప్రమాదం సంభవిస్తే వెంటనే స్పందించి సంబంధిత వైద్యశాలలకు తరలించాలన్నారు. జాతీయ రహదారిపై ఉన్న హైవేకు సంబంధించిన సిసి కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల గుర్తుతెలియని వ్యక్తులు ఢీకొని వెళ్లిపోవడంతో వాటిని దర్యాప్తు చేసేందుకు ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. జాతీయ రహదారిపై ఉన్న సిసి కెమెరాలు రాత్రి సమయంలో పనిచేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులు గురవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠంశెట్టి బాబ్జిని పరామర్శించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని బూరుగుపూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పాఠంశెట్టి బాబ్జి ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయాలయ్యాయి. ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. గండేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు కుంచె రామకృష్ణ, కిర్లంపూడి టిడిపి మండల సీనియర్ నాయకులు కుంచే తాతాజీ, కాకినాడ జిల్లా టిడిపి విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, తదితరులు పలకరించి ఆరోగ్య విషయాలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠంశెట్టి నాగేశ్వరరావు, కోప్పన పెద్దకాపు, కొల్లుమల్ల రామకృష్ణ, కొల్లుమల్ల లోవ బాబు, పెసల తాతాజీ పాల్గొన్నారు.

IN THE COURT OF THE I ADDITIONAL SENIOR CIVIL JUDGE, KAKINADA
H.M.O.P. No.383/2023

Between:
Kodamanchali Sivadurga @ Ganja Sivadurga ...Petitioner
and
Ganja Veera Kanakaraju ...Respondent

To: Respondent:
Ganja Veera Kanakaraju, S/o. Rambabu, aged about 29 years, Private Employee, D.No.9-22, Konda Veedhi, Prathipadu, Prathipadu Mandalam, E.G. Dist., A.P.

పై నెంబరు కేసులో పిటీషనర్, రెస్పాండెంట్ అయిన మీపై వివాహము రద్దు చేయమని కోరుతూ పిటీషన్ దాఖలుచేసి యున్నారు. సదరు కేసులో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.10-07-2024 తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై కేసును మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
P. BHARATA RAO
Advocate, Kakinada
K.VIJAY KUMAR, Advocate
Yanam, Cell: 9440144157

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

పిల్లల విద్యపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - గండేపల్లి

చిన్నపిల్లల విద్యపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని జగ్గంపేట సిడిపిఓ పూర్ణిమ సూచించారు. శనివారం గండేపల్లిలోని అంగన్‌వాడి కేంద్రం వద్ద కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బాల్యవివాహాలు మరియు అతిసారంపై గ్రామ ప్రజలకు కళాజాత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగుతుందన్నారు. బాలికలను చదివిద్దాం అనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. బాలలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని , వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎం.హనుమంతరావు, ఇఒపిఆర్‌డి బిఎస్ఎన్.మూర్తి, వైద్యాధికారి నరేష్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ పంచాయతీ పరిధిలో ఉన్న డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు కార్యక్రమం శనివారం ప్రారంభం అయ్యింది. ఉప్పాడ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, సర్పంచి ఉమ్మిడి మేరీజాన్ ఆధ్వర్యంలో జెసిబితో డ్రెయినేజీల్లో పూడికను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వాతావరణ వచ్చిన మార్పులతో వైరల్ జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందస్తుగా చర్యలు చేపట్టామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, కావున ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని వారు కోరారు.

పాస్‌పోర్టు పోయినది

సప్పా నాగమణి, W/o. రమణ, డో.నెం. 7-157, శ్రీరంగపట్నం గ్రామం, కోరుకొండ మండలం, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **W2905227** నెంబరు గల పాస్‌పోర్టు విశాఖపట్నం వారు మంజూరు చేసియున్నారు. సదరు పాస్‌పోర్టు నేను నా ఇంటి నుండి అనగా ది. 12-6-2024వ తేదీన శ్రీరంగపట్నం నుండి కోరుకొండ ఆటోలో వెళ్ళుచుండగా కోరుకొండ మార్గం మధ్యలో పడిపోయినది. ఎంత వెతికిన కనిపించలేదు. కనుక పై నెంబరు పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

సప్పా నాగమణి
డో.నెం. 7-157, శ్రీరంగపట్నం
కోరుకొండ మండలం, తూ॥గో॥జిల్లా

ఎంపిపి పదవికి పద్మజ రాజీనామా

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సిఇఒకు రాజీనామా పత్రాన్ని ఇస్తున్న ఎంపిపి

కాకినాడ రూరల్ ఎంపిపి గోపిశెట్టి పద్మజ తన పదవికి రాజీనామా చేశారు. శనివారం ఈమేరకు జడ్‌పి సిఇఒకు తన రాజీనామా పత్రాన్ని తన భర్త బాబ్జితో కలిసి ఆమె స్వయంగా అందజేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలో ఆమె వైసిపి తరఫున ఎంపిపిగా ఎన్నికయ్యారు. తన వ్యక్తిగత కారణాలు దృష్ట్యా తాను తన ఎంపిపి పదవికి రాజీనామా చేసినట్టు ఆమె స్పష్టం చేశారు.

గ్రామపంచాయతీ కార్యాలయము - సూర్యారావుపేట

టెండరు నోటీసు

ఠి.క. నెం.4/2024 — తేది. 29-06-2024

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలంలోని సూర్యారావుపేట గ్రామ పంచాయతీకి 2024-2025 సంవత్సరమునకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా సామాన్లు సప్లై చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 05-07-2024 సంవత్సరము తేదీన ఉదయం 12.00 గంటల వరకు సూర్యారావుపేట గ్రామపంచాయతి కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షములో తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర విషయములు కొరకు గ్రామ పంచాయతీ పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు.

వ.నెం.	అయిటము వివరములు	టెండరు ధరావత్తు
1	2024-25 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన (PH సామాగ్రి) ముగ్గు, బ్లీచింగ్, హైపోక్లోరైడ్ మొదలగు ప్రజారోగ్య సామాన్లు సప్లై చేయుటకు	రూ.100/-
2	2024-25 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన (PWS సామాగ్రి) చేతి పైపులు మరియు కుళాయి విడి భాగములు సప్లై చేయుటకు	రూ.100/-
3	2024-25 సామాగ్రి సంవత్సరముకు గాను గ్రామపంచాయతీకి కావలసిన ఎలక్ట్రికల్ సామాగ్రి మరియు విడి భాగములు సప్లై చేయుట	రూ.100/-
4	2024-25 సంవత్సరమునకు గాను నలుగురు స్వీపర్లు పోస్టులు, ట్యాంక్ వాచరు-1	రూ.100/-

గమనిక: గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు చేయబడును.

శ్రీమతి చింతపల్లి వెంకటలక్ష్మి, సర్పంచ్
గ్రామపంచాయతి, సూర్యారావుపేట
ఆలమూరు మండలం

సం/- **చింతా వీరవెంకటరెడ్డి, పంచాయతి కార్యదర్శి**
గ్రామపంచాయతి, సూర్యారావుపేట
ఆలమూరు మండలం

స్వయం ఉపాధికి బ్యాంక్ రుణాలు

ప్రజాశక్తి - యానాం

దీనదయాళ్ అంత్యోదయ యోజన జాతీయ పట్టణ ఉపాధి పథకం ద్వారా స్వయం ఉపాధికి బ్యాంక్ ద్వారా రుణాలు పొందుటకు అర్హత కలిగిన అభ్యర్థులు యానాం మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ కోరారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ఒక్కో స్వయం సహాయక సంఘానికి రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు రుణాన్ని బ్యాంకు ద్వారా పొందవచ్చన్నారు.

IN THE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE, KAKINADA
O.S.No. 33 / 2016

Between:
Nemani Krishna Mihira ...Plaintiff
and
Nemani Suryanarayana Murthy (died) & others ...Defendants

To: Defendants:
D8: Nemani Nageswara Rao, S/o. (late) Suryanarayana Murthy, age 50 years, Business, R/o. D.No.36-9-7, Kouthavari Lane, Kakinada.
D9: Nemani Srirama Sastry, S/o. (late) Suryanarayana Murthy, age 50 years, Business, R/o. D.No.36-9-7, Kouthavari Lane, Kakinada.
D10: Achalla Annapurna, W/o. Sanyasi Rao, age 49 years, House wife, R/o. D.No.36-9-7, Kouthavari Lane, Kakinada.
D11: Nemani Annapurna, W/o. (late) Veera Venkata Someswara Sarma, age 50 years, House wife, R/o. D.No.36-9-7, Kouthavari Lane, Kakinada.
D12: Nemani Surya Vasanth, S/o. (late) Veera Venkata Someswara Sarma, age 26 years, Private Employee, R/o. D.No.36-9-7, Kouthavari Lane, Kakinada.
D13: Sestrula Srivani, W/o. Manoj Kumar, D/o. (late) Veera Venkata Someswara Sarma, age 23 years, Student, R/o. D.No.36-9-7, Kouthavari Lane, Kakinada.

పై నెంబరు దావాలో 8 నుండి 13వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**05-07-2024** సం॥ం తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
ఎం.జవహర్ ఆలీ, అడ్వకేట్
డో.నెం.25-6-11, గంజావారి వీధి
కాకినాడ, సెల్: 9848307906